సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,730, మధ్య డెల్టాకు 1,125, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



వాడపల్లి వెంకన్నకు రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత భవన నిర్మాణానికి దుద్దుపూడి శ్రీధర్, పద్మ దంపతులు (రాజమహేంద్రవరం) రూ.లక్ష విరాళంగా సమర్పించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సెహరీ బుధ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.34
కాకినాడ	6.25	4.34
అమలాపురం	6.25	4.34

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్‌పై కార్యాచరణ సిద్ధం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు, హోమ్ ఓటింగ్‌కు నిర్దిష్ట కార్యాచరణ రూపొందించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెలగపూడిలోని కార్యాలయం నుంచి వివిధ అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా రిజర్వ్ ఎన్నికల సిబ్బందితో కలిపి ఆబ్సెంటీ ఓటర్లు 11,334 మంది, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 11,514 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 19,690 మంది ఉన్నారని వివరించారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి సహేతుకమైన వివరాలు సేకరించి, ఫారం 12డి ద్వారా ధ్రువీకరణ పత్రాలు సేకరిస్తున్నామని తెలిపారు.

బకాయి పడిన పంచాయతీలకు విద్యుత్ పునరుద్ధరణ

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిధులు విడుదలై, బకాయిలు చెల్లించని పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, వెంటనే పునరుద్ధరించామని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 శాతం గ్రాంట్ విడుదల చేసి, బకాయిలు చెల్లించాల్సిందిగా పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా కొన్ని పంచాయతీలు చెల్లించలేదని, వారికి అవగాహన కల్పించేందుకే విద్యుత్ సరఫరా నిలిపివేశామని వివరించారు. ప్రజావసరాలకు సంబంధించిన వీధి దీపాలు, తాగునీటి పథకాల విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా పంచాయతీ కార్యాలయాలకు మాత్రమే సరఫరా నిలిపామన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,069 పంచాయతీల నుంచి రూ.282.83 కోట్ల విద్యుత్ బకాయిలున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.77 కోట్లు ఫిబ్రవరిలో విడుదలయ్యాయని, వీటితో విద్యుత్ బకాయిలు చెల్లించాల్సిందిగా ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నోటీసులు అందుకున్న 451 పంచాయతీలు రూ.6.29 కోట్ల విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించని, అసలు బకాయిలు చెల్లించని పంచాయతీల్లోనే ప్రాథమిక చర్యగా సరఫరా నిలిపివేసి, వెంటనే పునరుద్ధరించామని మూర్తి వివరించారు.

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ మూల్యాంకనం ఈ నెల 8వ తేదీ వరకూ కొనసాగుతుంది. సుమారు 870 మంది ఉపాధ్యాయులను మూల్యాంకన విధుల్లో నియమించారు. మూల్యాంకనం జరుగుతున్న క్యాంప్‌ను రాష్ట్ర పరిశీలకుడు డి.మధుసూదనరావు సందర్శించారు. విధులు నిర్వర్తిస్తున్న వారికి పలు సూచనలు చేశారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీవీబీఎస్ నారాయణ, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ లక్ష్మీకుమారి మూల్యాంకనం కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్నారు.

రత్నగిరిపై పెళ్లి బృందాలకు ఊరట

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునే వారికి ఊరటనిచ్చేలా అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. రత్నగిరిపై వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునే వారు 50 మంది లోపు భోజనాలు, ఫలహారాలకు ఏ రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు. అంతకు మించి ఎక్కువ మందికి భోజనాలు, ఫలహారాలు తీసుకుని వెళ్తే దేవస్థానానికి నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈవిధంగా భోజనాలు, ఫలహారాలు దిగువ నుంచి తెచ్చుకునే వారిని దేవస్థానంలో క్యాంటీన్లు లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్లు ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎలక్ట్రిక్ బైక్‌లు దగ్ధం

కాకినాడ రూరల్: వాకలపూడి గంగానగర్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఎలక్ట్రిక్ బైక్‌లు, ఒక మోటార్ సైకిల్, కంప్యూటర్ సామగ్రి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని సాలిపేట ఏడీఎఫ్ఓ సుబ్బారావు తెలిపారు. షేక్ కరీమ్ ఇంటి వద్ద ఉన్న దుకాణంలో కట్టా బుల్లేశ్వరరావు కొత్త బైక్‌ల అమ్మకాలు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దుకాణం మూసివేసి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అగ్నిమాపక అధికారి సుబ్బారావు తెలిపారు.

పండుటాకులపై పగ

- వలంటీర్లతో పింఛన్ల పంపిణీని అడ్డుకున్న టీడీపీ
- నీచ రాజకీయంపై లబ్ధిదారుల ఆగ్రహం
- వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఆవేదన
- జిల్లాలో 2,44,730 మంది లబ్ధిదారులు
- ప్రతి నెలా రూ.72.66 కోట్ల పంపిణీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి నెలా ఒకటో తేదీన తెలతెలవారక ముందే గ్రామ/వార్డు వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల తలుపు తట్టి.. పింఛన్లు అందిస్తూ ఆ అభాగ్యుల కళ్లల్లో ఆనందాన్ని విరబూయిస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఇది చూసి ఓర్వలేని టీడీపీ.. జీవితపు మలిసంధ్యలో మగ్గిపోతున్న పండుటాకులపై టీడీపీ పగబట్టింది. ఎన్నికల నిబంధనావళిని అడ్డం పెట్టుకుని ఆ అభాగ్యులపై అక్కసు వెళ్లగక్కింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ఏళ్ల తరబడి కీలక భూమిక పోషిస్తున్న వలంటీర్ల ద్వారా పింఛను సొమ్ము అందించనీయకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఫలితంగా మళ్లీ 'పచ్చ' పాలన నాటి కష్టాలను ఎదుర్కోవాల్సిన దుస్థితిలోకి లబ్ధిదారులను నెట్టేసింది. వలంటీర్లతో పింఛన్లు ఇంటి వద్ద అందించనివ్వకుండా టీడీపీ అడ్డం పడటంతో.. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర లబ్ధిదారులు సచివాలయాల వద్దకు పరుగులు తీసి, పడిగాపులు పడాల్సిన దుస్థితి ఎదురు కానుంది. కులం, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు కూడా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి తలెత్తనుంది. తమను ఇటువంటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పై అభాగ్యులు మండిపడుతున్నారు. వారి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్కసుతోనే..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర సామాజిక పింఛన్ లబ్ధిదారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఎన్నికల హామీలో భాగంగా పింఛను మొత్తాన్ని దశలవారీగా రూ.3 వేలకు పెంచారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దనే పింఛన్ సొమ్ము అందించే ఏర్పాటు చేశారు. గతంలో రోజుల తరబడి క్యూలో నిలబడి పెన్షన్ తెచ్చుకునే దుస్థితి తప్పడం, ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ అందిస్తూండటంతో లబ్ధిదారుల ఆనందానికి అవధి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పింఛన్ లబ్ధిదారులందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారనే అక్కసుతో చంద్రబాబు తన కుట్రలకు పదును పెట్టారు. సిటిజన్ ఫోరమ్ ఫర్ డెమోక్రసీ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేయించి మరీ పెన్షన్ పంపిణీపై కుట్రలు చేశారు. ప్రజలకు కలుగుతున్న మేలును అడ్డుకునేలా సాగించిన ఈ నీచ రాజకీయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రెండు లక్షలకు పైగా లబ్ధిదారులకు పంపిణీ

జిల్లాలో 2,44,730 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతి నెలా సామాజిక పింఛన్లుగా రూ.72.66 కోట్లు అందిస్తోంది. సూర్యుడు రావడమైనా ఆలస్యమవుతుందేమో కానీ ఒకటో తేదీన వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము లబ్ధిదారుకు అందించడం మాత్రం ఆలస్యమయ్యేది కాదు. కేవలం ఇంటి వద్దనే కాదు.. లబ్ధిదారులు అనారోగ్య కారణాలతో వేరే చోట ఉన్నా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా.. వారి వద్దకు వెళ్లి మరీ వలంటీర్లు నిస్వార్థంగా పింఛన్లు అందిస్తున్నారు. చంద్రబాబు అండ్ కో అవమానకరంగా అనేక మాటలు అన్నప్పటికీ వారు మాత్రం నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారు. అటువంటి వారి సేవలను నేడు కోడ్ పేరిట దూరం చేయడంపై లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాలలో పింఛన్ పంపిణీ

ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో ఈ నెల పింఛన్లను ఆయా సచివాలయాల్లో బుధవారం నుంచి చేపట్టనున్నారు. లబ్ధిదారులు వారి దగ్గరలోని సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవలసి ఉంటుంది. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుల వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ అందించనున్నారు. ప్రతి నెలా 1, 2 తేదీల్లోనే పింఛన్ల పంపిణీ నూరు శాతం జరిగేది. ఈసారి వలంటీర్లు లేకపోవడంతో ఎక్కువ రోజులు పట్టే పరిస్థితి కనిపిస్తోంది.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

పంపిణీని అడ్డుకోవడం తగదు



వలంటీర్ల ద్వారా ప్రతి నెలా పెన్షన్ సొమ్మును సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే పంపుతున్నారు. ఈ డబ్బులు మందులకు, తినడానికి ఉపయోగపడుతున్నాయి. మావంటి వృద్ధులు పింఛన్ సొమ్ము తీసుకోవడానికి వెళ్లలేని పరిస్థితి ఉంది.

– జె.సూర్యకాంతం, రాజమహేంద్రవరం

జగన్‌తోనే మేలు



గతంలో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వచ్చిన కొద్దిపాటి సొమ్ములో అక్కడి వారికి వాటా ఇవ్వాల్సి వచ్చేది. కానీ సీఎం జగన్ వచ్చాక ఆ పరిస్థితి మారింది. ఇంటికే వచ్చి వలంటీర్ పెన్షన్ ఇస్తున్నారు. ఎంతో మంది వృద్ధులు, వికలాంగులకు మేలు జరుగుతుంటే చూడలేక ఇటువంటి కుట్రలు పన్నుతున్నారు. జగన్‌తోనే మాకు మేలు జరుగుతుంది.

– నక్కా నారాయణమ్మ, రాజమహేంద్రవరం

ఏం పాపం చేశామని?



సీఎం జగన్ పెన్షన్ల నుంచి పథకాల వరకూ మాకు శ్రమ లేకుండా వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని పెంచుతూ అండగా నిలిచారు. అటువంటి వలంటీర్ వ్యవస్థపై బురద జల్లడం సమంజసం కాదు. ఏం పాపం చేశామని ఈ వయస్సులో మాకీ శిక్ష? మేం సంతోషంగా ఉండటం చంద్రబాబుకు ఇష్టం లేదా? మాలాంటి వారి ఉసురు తప్పక తగులుతుంది.

– ఎం.గోతియ్య, చాగల్లు

కరోనా సమయంలో ఆదుకున్నారు



కరోనా వంటి కష్ట సమయంలో కూడా వలంటీర్లు వారి ప్రాణాలకు తెగించి మరీ మాకు సేవలు చేశారు. నాయకులందరూ హైదరాబాద్‌లో ఉంటే వలంటీర్లు, జగనన్న మాత్రం మా గురించి ఆలోచించారు. ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చే వారిని ఎన్నికల పేరు చెప్పి దూరం చేయడం దుర్మార్గం.

– పీతల నాగమణి, రాజమహేంద్రవరం

పింఛన్ల పంపిణీకి చర్యలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, వివిధ శాఖల అధికారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీకి కార్యాచరణ రూపొందించేందుకు సంసిద్ధంగా ఉండాల్సిందిగా సమన్వయ శాఖల అధికారులకు స్పష్టం చేశామన్నారు. వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తు చర్యలు, సమన్వయంపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలూ లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైనన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలూ లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ మాధవీలత ఆదేశించారు.

గోదావరి నిత్య హారతి సమయం మార్పు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక పుష్కర్ ఘాట్‌లో ప్రతి రోజూ సాయంత్రం నిర్వహించే గోదావరి హారతి సమయం మార్చినట్లు దేవదాయ శాఖ ఈఓ టి.తారకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాస్తమయ వేళ మార్పును అనుసరించి హారతిని సోమవారం నుంచి రాత్రి 7 గంటలకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

విపక్ష కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు

- వలంటీర్లపై నిందలు మంచి పద్ధతి కాదు
- పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం బాధాకరం
- హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్న ప్రజల ఆనందాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కాలరాయాలని చూస్తున్నారని, వీరికి ఆ ప్రజలే త్వరలో తగిన బుద్ధి చెబుతారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. ఈ మేరకు యర్నగూడెంలోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఆమె ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు స్వచ్ఛందంగా సత్వర సేవలు అందిస్తూ, అన్ని వర్గాల మన్ననలు పొందుతున్న గ్రామ/వార్డు వలంటీర్లను అభినందించకపోగా.. టీడీపీ, జనసేన నేతలు నిందలు మోపుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. మహిళలను రవాణా చేస్తున్నారని, పింఛన్ల పంపిణీతో ప్రలోభాలకు గురి చేస్తారని, డేటా చోరీ చేసి అమ్మేస్తున్నారని తప్పుడు ప్రచారం చేశారని, ఇప్పుడు టెర్రరిస్టులంటూ మరింత దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ ఆరోపణలను మంత్రి ఖండించారు. ప్రజలకు పింఛన్లు సకాలంలో అందకుండా అడ్డం పడిన తీరు చాలా బాధాకరంగా ఉందని అన్నారు. టీడీపీ నాయకుడిగా ఉన్న నిమ్మగడ్డ రమేష్ ఆధ్వర్యాన వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారని తెలిపారు. దీనివలన లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవలసిన దుస్థితి ఏర్పడిందని ఆమె అన్నారు. పింఛన్లు ఎప్పుడు, ఎలా అందుతాయో తెలియక పేదలు తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. వలంటీర్లను బలి చేయాల్సిన అవసరం ప్రతిపక్షాలకు ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. వలంటీర్లు ప్రజలను ప్రభావితం చేస్తారనుకుంటున్నారని, అలా చేయాల్సిన అవసరం లేదని, ప్రజల గుండెల్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. చేసిన మంచి పనులే సీఎం జగన్‌ను మరోసారి గెలిపిస్తాయనే విషయం టీడీపీ కూటమికి తెలియడం లేదని, ఇది తెలుసుకోవడానికి వారికి జీవిత కాలం సరిపోదని మంత్రి వనిత అన్నారు.



తానేటి వనిత, రాష్ట్ర హోం శాఖా మంత్రి

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

- మే 13.. పోలింగ్ డే
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత
- ఓటర్లను చైతన్యపరిచేందుకు రూరల్‌లో స్వీప్ కార్యక్రమం
- బైక్ ర్యాలీ నిర్వహణ
- పాల్గొన్న ఉన్నతాధికారులు

రాజమహేంద్రవరం రూరల్: వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. ఓటు ఆవశ్యకతపై ఓటర్లలో అవగాహన పెంచే లక్ష్యంతో చేపట్టిన సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా రూరల్ నియోజకవర్గంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆధ్వర్యాన స్థానిక రివర్ బే ప్రాంతం నుంచి హుకుంపేట డి-మార్ట్ వరకూ జరిగిన ఈ ర్యాలీని కలెక్టర్, ఎస్పీ పి.జగదీష్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, జిల్లాలో ఏడాది కాలంగా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ, అర్హులైన అందరినీ ఓటర్లుగా నమోదు చేశామని చెప్పారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 16.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. గత ఎన్నికల్లో రూరల్‌లో ఎక్కువ, సిటీలో తక్కువ శాతం పోలింగ్ నమోదైందన్నారు. అన్ని ప్రాంతాల్లో ఓటర్లకు అందుబాటులోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ ఆ రోజు ఓటు వేసి, పోలింగ్ శాతం పెంచాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ, ఓటింగు శాతం పెరిగేలా ఓటర్లకు చైతన్యం కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని అన్నారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లలో విశ్వాసం పెంపొందించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇందులో భాగంగానే కేంద్ర బలగాల ఆధ్వర్యాన సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద, గత ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరిగిన ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, నిఘా పెట్టామన్నారు. ఓటర్లను ఎటువంటి ప్రలోభాలకూ గురి చేయకుండా ముందస్తుగా డబ్బు, మద్యం వంటి వాటిని సీజ్ చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఓటర్లను చైతన్యపరచడం కోసమే..

జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో జిల్లాలో 76 శాతం పోలింగ్ జరగగా, రూరల్ నియోజకవర్గంలో 73 శాతం మాత్రమే నమోదైందన్నారు. మే 13ను సెలవు దినంగా చూడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి.సువర్ణ, సహాయ రిటర్నింగ్ అధికారులు/తహసీల్దార్లు వైకేవీ అప్పారావు, బి.రమాదేవి, డీఎస్పీలు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.అంబికా ప్రసాద్, సీఐలు, ఎంపీడీఓలు డి.శ్రీనివాసరావు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రబీ ధాన్యం సేకరణ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో మూడు దశల్లో రబీ ధాన్యం సేకరిస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. మొదటి విడతగా చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు, రంగంపేట మండలాల్లోని 87 కొనుగోలు కేంద్రాల ద్వారా మంగళవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపడతామని చెప్పారు. రబీ ధాన్యం సేకరణపై పౌర సరఫరాలు, అనుబంధ శాఖల అధికారులతో సోమవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రస్తుత రబీలో జిల్లాలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జిల్లాలోని 229 రైతుభరోసా కేంద్రాల పరిధిలో ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. మూడు దశల్లో ఆయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, సేకరణ లక్ష్యాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెండో విడతగా ఈ నెల 5 నుంచి 55 కొనుగోలు కేంద్రాల ద్వారా బిక్కవోలు, కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, ఉండ్రాజవరం మండలాల్లో కొనుగోళ్లు చేపడతామని వివరించారు. మూడో విడతగా ఈ నెల 9 నుంచి అనపర్తి, గోకవరం, కోరుకొండ, సీతానగరం, నల్లజర్ల, గోపాలపురం, పెరవలి మండలాల్లోని 87 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టామని జేసీ తేజ్‌భరత్ తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.విజయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనంలో 143 మంది

శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7న అమలాపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరగనున్న 132వ ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పలు రాష్ట్రాలకు చెందిన 143 మంది కవులు పాల్గొంటున్నారని ఆ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వెల్లడించారు. స్థానిక పట్టాభివీధిలోని సాయి సంజీవని ఆస్పత్రి ఆడిటోరియంలో జిల్లా శ్రీశ్రీ కళావేదిక సోమవారం నిర్వహించిన కవి సమ్మేళనం సన్నాహక సమావేశానికి డాక్టర్ ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కవులు సమ్మేళనంలో అధికంగా పాల్గొంటారని చెప్పారు. కవి సమ్మేళనం ఆ రోజు ఉదయం 8.30 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటల వరకూ నిర్విరామంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్లను డాక్టర్ ప్రతాప్‌తోపాటు కవులు ప్రదర్శించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వేదిక జిల్లా అధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గుర్రం రామకృష్ణారావు, మాకే బాలార్జున సత్యనారాయణ పాల్గొన్నారు.

నిలకడగా వర్జీనియా పొగాకు ధర



దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు చేస్తున్న ట్రేడర్లు

- రూ.50.24 కోట్ల విలువైన పొగాకు కొనుగోలు
- కిలో సగటు ధర రూ.239.53

దేవరపల్లి: మార్కెట్లో వర్జీనియా పొగాకు ధర నిలకడగా కొనసాగుతోంది. మార్కెట్ అనుకూలంగా లేకపోవడంతో రైతులు వేలం కేంద్రాలకు పూర్తి స్థాయిలో బేళ్లు తీసుకుని రావడం లేదు. సోమవారం నాటికి 20 రోజులు వేలం నిర్వహించగా, ఇప్పటి వరకూ రూ.50.24 కోట్ల విలువైన 21.10 లక్షల కిలోల పొగాకు కొనుగోలు చేశారు. ఈ నెల రెండో వారం నుంచి మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. అక్కడి నుంచి కొనుగోలు ఊపందుకుంటుందని అధికారులు అంటున్నారు. జిల్లాలోని దేవరపల్లి, గోపాలపురం, ఏలూరు జిల్లాలోని కొయ్యలగూడెంతో పాటు జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో గత నెల 6వ తేదీన పొగాకు వేలం ప్రారంభించారు. కిలో పొగాకు రూ.240తో వేలం ప్రారంభం కాగా, ప్రస్తుతం కిలో గరిష్ఠ ధర రూ.241 పలుకుతోంది. ఇది గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు. ఐదు వేలం కేంద్రాల్లో కిలో సగటు ధర రూ.239.53 పలకగా, గరిష్ఠ ధర రూ.241, కనిష్ఠ ధర రూ.235 పలికింది. ఇప్పటి వరకూ ఐదు వేలం కేంద్రాల్లో 17,789 బేళ్లు కొనుగోలు చేశారు. 13 కంపెనీల నుంచి కొనుగోలుదారులు వేలంలో పాల్గొంటున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అబ్దుల్ కుదుష్ (ఫైల్)

కొవ్వూరు: పట్టణ శివారున సోమవారం రాత్రి మోటార్ సైకిల్ అదుపు తప్పి సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో చాగల్లుకు చెందిన అబ్దుల్ కుదుష్ (20) మృతి చెందాడు. నల్లజర్లలో తన బావకు చెందిన కళ్లజోళ్ల షాపులో కుదుష్ పనిచేస్తున్నాడు. రాజమహేంద్రవరానికి పనిమీద వెళుతుండగా కొవ్వూరులో సిగ్నల్ స్తంభాన్ని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మోటారు సైకిల్ నుజ్జునుజ్జయ్యింది. జాతీయ రహదారి నుంచి కొవ్వూరు పట్టణంలోకి వచ్చే సర్వీసు రోడ్డు దిగువున గల కల్వర్టు వద్ద ఈ ప్రమాదం జరిగింది. పట్టణ సీఐ వి.జగదీశ్వర రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై ఎండీ జువేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 2,100 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పడమటపాలెంకు చెందిన మంజుల సతీష్‌కుమార్, నడకుదటి బాలకృష్ణ సోమవారం వ్యాన్‌లో అక్రమంగా డీజిల్ తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వ్యాన్ సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన భర్తపై కేసు

కొవ్వూరు: తన భర్త కుమారుడిని, తనను విడిచి పెట్టి ఆరు నెలలు నుంచి ఇబ్బందులు పెడుతున్నాడని, కుటుంబ పోషణ పట్టించుకోవడం లేదని, తన బంధువులు నిలదీయగా కులం పేరుతో దూషించినట్లు పాశం ఉష ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. పట్టణానికి చెందిన పాశం రవిశంకర్‌తో తనకు 2018లో కూలాంతర వివాహం అయ్యిందని, 2020లో తమకు ఒక కుమారుడు పుట్టినట్లు పేర్కొంది. గడచిన ఆరు నెలల నుంచి తనను నానా ఇబ్బందులు పెడుతున్నాడని ఫిర్యాదు చేసిందన్నారు. మార్చి 19న కోర్టు దగ్గరకు వచ్చి తన బంధువులు నిలదీయడంతో తనను, తన బంధువులను కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

వైవిధ్య భరితం.. అరుదైన చరితం

- అమ్మవారి జాతర్లలో భిన్నమైన ఆచారాలు
- దుష్టశక్తులు రాకుండా కర్రలతో కాపలా
- దోషాలు పోవాలంటే దున్నపోతు తొక్కాల్సిందే


ఉప్పాడ శివారు కొత్తపట్నంలో నేరేళ్లమ్మవారు


అమీనాబాద్ గ్రామంలో దున్నపోతుతో తొక్కించుకుంటున్న గ్రామస్తులు (ఫైల్)


కొత్తపట్నంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు దుష్టశక్తులు రాకుండా కర్రలతో కొడుతూ కాపలా కాస్తున్న యువకులు (ఫైల్)

పిఠాపురం: అది ఉప్పాడ సాగర తీరం. సముద్ర కెరటాల హోరు నిత్యం ధ్వనిస్తుంటుంది. కాని ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో అమావాస్య, పౌర్ణమిలకు సముద్ర ఘోషను సైతం తోసిరాజని అమ్మవార్ల నామస్మరణ మారు మోగుతుంది. గ్రామ దేవతల జాతరలతో అన్ని గ్రామాలు పులకించిపోతాయి. తీర ప్రాంతంలో అమ్మవార్ల జాతరలు విభిన్న ఆచారాలతో ఆకట్టుకుంటాయి. కళకళలాడుతున్న విద్యుద్దీపాల మధ్య జనం చుట్టూ ఉండి కర్రలతో కొడుతున్న దృశ్యం చూస్తే అక్కడ ఏదో పెద్ద గొడవ జరుగుతోందని, ఎవరినో మధ్యలో పెట్టి కొడుతున్నారనే అనుమానం వస్తుంది. కాని అది ఒక ఆచారం అని తెలిసాక ఆశ్చర్యపోక తప్పదు. జనం అందరూ నేలపై పడుకుని ఉండగా ఒక దున్నపోతు వారిపై నుంచి పరుగులు తీస్తుంటే పక్కనే ఊరంతా గుమిగూడి చూస్తూ దణ్ణం పెడుతుంటే ఇదేంటి ఇంత దారుణం జరుగుతున్నా అలా చూస్తున్నారేమిటి అని పిస్తుంది కాని అదీ ఒక ఆచారమే అని తెలిసాకా ఔరా అనిపించకమానదు. మార్చి నెల రెండవ వారం నుంచి అన్ని గ్రామాలు, పట్టణాల్లో గ్రామ దేవతల సంబరాలు ప్రారంభమవుతాయి. మే నెల మొదటి వారం వరకు ఇవి కొనసాగుతాయి. విభిన్న ఆచారాల కలబోతతో కుల మతాలకు అతీతంగా ఈ ఉత్సవాలు జరుపుకుంటారు.

తీరంలో తీరే వేరు..

ఇక తీర ప్రాంత గ్రామాల్లో ఆలయాల దేవతలు చిత్ర విచిత్రంగా ఉంటారు. అక్కడ ఉండేవి ఆలయాలే కాని నిత్యధూప, దీప, నైవేద్యాలు, పూజలు ఉండవు. కానీ అమ్మవారి ప్రతిమలు ఉంటాయి. కొలిచే భక్తులు కోకొల్లలే వైవిధ్య భరితంగా కనిపించే ఆ ఆలయాల్లో మత్స్యకారులు కొలిచే దేవతలు ఉంటారు. సాధారణంగా గ్రామ దేవతల ఆలయాలలో ఎక్కువ శాతం నిత్య ధూప దీప నైవేద్యాలు ఉండక పోయినా భద్రత ఉంటుంది. ఆలయాలకు తలుపులు, ప్రహరీ గోడలు ఉంటాయి. వాటిలో విగ్రహాలకు కచ్చితమైన రూపురేఖలు ఉంటాయి కానీ ఇక్కడ అవేమీ కనిపించవు. మత్స్యకారులు మనస్సులోనే అమ్మను తలచుకుంటూ ఆమెపై భారం వేసి జీవనోపాధికి వెళుతుంటారని చెబుతున్నారు. తీర ప్రాంత గ్రామాలలో మాత్రమే కనిపించే ఈ ఆలయాలు ఎంతో విశిష్టతను కలిగి ఉంటాయి. నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంపై చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తమతమ ఇష్టదైవాలైన అమ్మవార్లకు మొక్కుకుని వేటకు వెళుతుంటారు. దానికి అనువుగా నిర్మించుకున్న ఆలయాలు చూసేవారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటాయి.

ఆద్యంతం ఆకట్టుకునేలా..

అత్యంత నియమ నిష్టలతో మత్స్యకారులు చేసే అమ్మవారి జాతరలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి.

పూర్వం నుంచీ..

ఉప్పాడ శివారు కొత్తపట్నంలో వేంచేసియున్న గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతరలో అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు ఊళ్లో యువకులంతా కలిసి కర్రలతో కాపాలా కాస్తారు. నైవేద్యం సమర్పించే టప్పుడు దుష్టశక్తులు ఏవీ రాకుండా కర్రలతో కొడుతు అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఇక్కడ పూర్వ కాలం నుంచి వస్తున్న ఆచారంగా స్థానికులు చెబుతున్నారు.

సాధారణంగా మత్స్యకారులు పూజించే అమ్మవార్ల పేర్లు నేరేళ్లమ్మ, భాగిర్తమ్మ, బంగారమ్మ, గంగమ్మ, కాశిమ్మ, పోలేరమ్మ, చినతల్లి, పెదతల్లి అనేటి వంటి అనేక పేర్లతో పిలుచుకుంటారు. ఇతర ప్రాంతాల్లో ముత్యాలమ్మ, నక్కుళ్లమ్మ, సత్తెమ్మ, బోడ కొండమ్మ, నూకాలమ్మ, మరిడమ్మ, మావుళ్లమ్మ తదితర పేర్లతో పిలుస్తుంటారు.

దోషాలు పోతాయని

అమీనాబాద గ్రామంలో పోలేరమ్మ జాతరలో ఒక దున్న పోతును జాతరకు ముందు కొన్ని నెలల నుంచి పెంచి పోషించి ప్రత్యేక పూజల అనంతరం దానితో తొక్కించుకుంటారు. గ్రామంలో ప్రజలు స్నానాలు చేసి వరుసగా నేలపై పడుకుని ఉండగా దున్నపోతును వారిపై నుంచి నడిపిస్తారు. దున్నపోతు గిట్టలు తమ శరీరాలకు తగిలితే వారికి ఉన్న రోగాలు పోతాయని వారి ఆచారంగా స్థానికులు చెబుతారు.

ఏడాదిలో ఒకటే పండగ

సాధారణంగా గ్రామ దేవతల ఆలయాలలో ఎక్కువ శాతం వారానికి ఒక సారైనా సాధారణ పూజలు చేస్తుంటాం. కానీ గ్రామ దేవతల ఆలయాలలో దేవతలకు మాత్రం ఏడాదికి ఒకసారి అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తాం. కఠికమైన నియమనిష్టలతో ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అగ్నిగుండాలు తొక్కడం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తాం. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్ది ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తాం. మా ఆచారం ప్రకారం అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు దుష్టశక్తులు రాకుండా కాపాలా కాస్తుంటాం.

వనమాడి జగన్నాథం, కొత్తపట్నం, ఉప్పాడ

మా తాతల నాటి నుంచీ..

మా తాతల కాలం నుంచీ దున్నపోతుతో తొక్కించుకోవడం ఆచారంగా వస్తోంది. ఇది చాలా నిష్టగా చేస్తారు. మా గ్రామంలో అమ్మోరులుగా కొందరు మహిళలు ఉంటారు. వారికి దండలు వేసి అమ్మవారిగా భావిస్తారు. గ్రామస్తుల కింద పడుకుని ఉండగా వారిపై నడిపిస్తారు. వీరితో పాటు దున్నపోతును నడిపిస్తారు. ఇలా చేయడం వల్ల మా గ్రామంలో ఉన్న దోషాలు పోతాయని నమ్ముతాం.

– నక్కా మణికంఠ, సర్పంచ్ అమీనాబాద్, కొత్తపల్లి మండలం

రూ.1.20 లక్షల నగదు పట్టివేత


నగదు స్వాధీనం చేస్తుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి సత్యనారాయణరెడ్డి


చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో పోలీసులు

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం అంతర్ జిల్లాల చెక్‌పోస్టు వద్ద ఎటువంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాళ్ళపూడి మండలానికి చెందిన నీలం వీరబద్రరావు విజయవాడ నుంచి రసీదులు లేకుండా కారులో తరలిస్తున్న నగదును చెక్‌పోస్టు తనిఖీలలో పట్టుకున్నట్లు చెప్పారు.

చింతపల్లిలో రూ.93 వేల నగదు స్వాధీనం

పెదపూడి: నిబంధన ప్రకారం వాహనాల తనిఖీ చేపడుతున్నామని మండల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి ఎం. సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి లాకు వద్ద మధ్యాహ్నం వాహనాలు తనిఖీ చేస్తుండగా పిఠాపురానికి చెందిన రాజబాబు కారులో రూ.93 వేల నగదును తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

రాజబాబు పిఠాపురం నుంచి మండపేట సమీపంలోని సందుపూడి గ్రామానికి నగదు తీసుకెళుతున్నట్లు తెలిపారు. రాజబాబు నగదుకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదన్నారు. దీంతో వీఆర్‌ఏ రిపోర్ట్ ఆధారంగా నగదు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించమన్నారు. ఈ తనిఖీల్లో పోలీసులు రాజు, రమేష్, శ్రీనివాసు పాల్గొన్నారు.

కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య


భాగ్యశ్రీ మృతదేహం వద్ద వివరాలను సేకరిస్తున్న ఏఎస్సై, తహసీల్దార్

తాళ్లపూడి: మండలంలోని తిరగుడుమెట్టలో కడుపు నొప్పిని తాళలేక వివాహిత చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిరుగుడుమెట్టకు చెందిన సైదు భాగ్యశ్రీ(24) సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కొద్ది రోజులుగా కడుపు నొప్పి, తీవ్రమైన తలనొప్పి తరచుగా వస్తోంది. గ్రామానికి చెందిన మృతురాలు పెద్దమ్మ పంతుల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన భాగ్యశ్రీకి 2018లో గ్రామానికి చెందిన సైదు సాయిబాబాతో వివాహం జరిగింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. భర్త మూడు నెలలు క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లడంతో అత్తగారింటి వద్ద ఉంటోంది. గ్రామంలో మృతురాలికి బంధువులు కూడా ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్యామ్‌సుందర్ తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ సునీత వివరాలు సేకరించారు.

నిచ్చెన లేక మృత్యు కుహరానికి..

- వెల్డింగ్ చేస్తుండగా పేలిన ట్యాంకర్
- ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు
- కత్తిపూడిలో విషాదం


కొంజర్ల ప్రభాకర్


బూరా సోమరాజు


పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల బంధువులు, స్నేహితులు

పిఠాపురం: చిన్న నిచ్చెన పెద్ద ప్రమాదానికి కారణమయ్యింది. ఆ నిచ్చెన లేక పైకి ఎక్కి మూతలు తీయడం కుదరక చిన్న పనే కదా అనుకుని ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా తొందరపడి వెల్డింగ్ చేయడంతో పెద్ద ప్రమాదం ఏర్పడి రెండు కుటుంబాలను దిక్కు లేని వారిని చేసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండల శివారు ప్రాంతంలో ఒక ఆయిల్ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా అది పేలిపోవడంతో ఇద్దరు మృతి చెందగా ఒకరికి గాయాలయిన ఘటన మృతుల స్వగ్రామం కత్తిపూడిలో విషాదాన్ని నింపింది. కత్తిపూడికి చెందిన గాబు గంగాధర్ తన అయిల్ ట్యాంకర్‌కు మరమ్మతులు చేసేందుకు కత్తిపూడికి చెందిన లారీ డ్రైవరు బూరా సోమరాజు అలియాస్ శ్యామ్యూల్ (45)ను వెల్డింగ్ మేస్త్రీ కత్తిపూడికి చెందిన కొంజెర్ల ప్రభాకర్ వద్దకు పంపించాడు. వారు గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారు తొండంగి మండలం రావికంపాడు సమీపంలో ఏలేరు కాలువ వద్ద ఉన్న వెల్డింగ్ షాపునకు వెళ్లారు. కొంజెర్ల ప్రభాకర్ వెల్డింగ్ చేస్తున్నాడు. పనిని లారీ డ్రైవరు బూరా సోమరాజు దగ్గర ఉండి చూస్తున్నాడు. ఇంతలో ఆయిల్ ట్యాంకు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోవడంతో దగ్గరగా ఉన్న లారీ డ్రైవరు బూరా సోమరాజు, వెల్డింగ్ మేస్త్రీ కొంజెర్ల ప్రభాకర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. వెల్డింగ్ షాపు ఓనరు నున్న లోవరాజుకు గాయాలు అయ్యాయి. గాయాలైన లోవరాజును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.


ప్రమాదంలో పేలి పోయిన ఆయిల్ ట్యాంకర్

నిచ్చెనే ప్రాణాలను తీసింది

ట్యాంకర్‌కు ఉన్న మూతలు తీయకుండా వెల్డింగ్ చేయడం వల్ల ట్యాంకు లోపల వేడి గాలి పెరిగి పేలుడు సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. సాధారణంగా ఆయిల్ ట్యాంకర్లకు పైన మూతలు ఉంటాయి. వాటిని ఎప్పుడూ మూసే ఉంచుతారు. ప్రస్తుతం ప్రమాదానికి గురైన ట్యాంకర్‌కు మూతలు వేసే ఉన్నాయి. ట్యాంకర్ వెనుక భాగంలో ఉండే నిచ్చెన ఊడి పోవడంతో అలా ఉండగా వెల్డింగ్‌కు తీసుకువచ్చిన డ్రైవరు మూతలు తీసి చేయిద్దామనుకుంటే పైకి ఎక్కి మూతలు తీయడానికి నిచ్చెన లేక వేరే విధంగా ఎక్కడానికి వీలు కుదరక చిన్న పనే కదా, అవసరం ఉండదని భావించి మూతలు తీయకుండానే వెల్డింగ్ చేయడం ప్రారంభించారు. అంతే వెల్డింగ్ మొదలు పెట్టిన నిమిషాల్లోనే పేలుడు సంభవించింది. ట్యాంకర్ ముక్కలు ముక్కలుగా విడిపోయి వెనుక వెల్డింగ్ పనిలో ఉన్న లారీ డ్రైవరు బూరా సోమరాజు, వెల్డింగ్ మేస్త్రీ కొంజర్ల ప్రభాకర్‌ల పైకి దూసుకువచ్చి బలంగా ఢీకొట్టడంతో వెనుకకు ఎగిరిపడిన ఇద్దరు వెనుక ఉన్న ఇనుప చట్రాలపై పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను మంచినీటి సరఫరాకు వినియోగిస్తున్నారు. వాటర్ ట్యాంకు కావడం వల్ల పేలుడు ప్రభావం తక్కువగా ఉందని అదే ఆయిల్ ట్యాంకర్ అయితే లోపల ఉన్న కొద్ది పాటి ఆయిల్‌తో పేలుడు ధాటికి మంటలు కూడా వ్యాపించి పెద్ద విస్ఫోటం సంభవించేదని పోలీసులు చెబుతున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయిన రెండు కుటుంబాలు

మృతుడు సోమరాజు 20 ఏళ్లుగా లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. అతనికి భార్య ప్రియాంక. కుమారుడు వరుణ్, కుమార్తె సమీరా ఉన్నారు. లారీ డ్రైవరుగా ఉద్యోగం చేస్తూ సంపాదించిన దానిపైనే కుటుంబం నడుస్తోందని ఇక జీతం డబ్బులు తెచ్చి మమ్మల్ని పోషించేదెవరంటూ మృతుడి సోమరాజు భార్య,పిల్లలు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. మరో మృతుడు కొంజర్ల ప్రభాకర్‌కు భార్య చిన్నారి, కుమారులు త్రినాథ్, చందు, కుమార్తె తేజస్విని ఉన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం వారిది. కుటుంబం అంతా ప్రభాకర్‌పైనే ఆధారపడి ఉంది. ప్రమాదంలో ప్రభాకర్ చిన పోయాడని తెలిసి ఇక మాకు దిక్కెవరంటూ అతని భార్య పిల్లలు గుండెలవిసేలా రోదిస్తుంటే ఆపడం ఎవరితరం కాలేదు.

రాము కార్టూన్‌కి జ్యూరీ అవార్డు




అవార్డు సాధించిన కార్టూన్ (అంతరచిత్రం) మాడా రాము

అమలాపురం రూరల్: నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూన్ ఫోరమ్, విశాఖపట్నం ఆధ్వర్యంలో హాస్యానందం మాసపత్రిక సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మాడా రాము కార్టూన్‌కు ప్రత్యేక జ్యూరీ బహుమతి లభించింది. తల్లిదండ్రుల డబ్బుతో విదేశాల్లో స్థిరపడిన పిల్లలు వారి బాగోగులు చూడకపోవడంతో, జీవచ్ఛవాలుగా మారిన దుస్థితిని వివరిస్తూ గీసిన చిత్రానికి జ్యూరీ అవార్డు ప్రకటించారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది తెలుగు కార్టూనిస్టులు 194 ఎంట్రీలను పంపగా 25 ఉత్తమ కార్టూన్లు ఎంపిక చేశారని రాము తెలిపారు. బహుమతి ప్రదాన సభ 14వ తేదీన విజయవాడలో నిర్వహిస్తారని కార్టూనిస్ట్ రాము కి సమాచారం అందింది.

కాలువలో పడి కూలీ మృతి

కడియం: మండలంలో కడియపులంక వద్ద కోటిపల్లి కాలువలో పడి దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాయపురెడ్డి అయ్యప్ప (45) అనే వ్యవసాయ కూలీ మృతి చెందాడు. సోమవారం కడియపులంక వచ్చిన అయ్యప్ప పని ముగించుకుని స్నానానికి పూలమార్కెట్ సమీపంలోనే కాలువ రేవు వద్దకు వచ్చాడు. అక్కడ స్నానానికి దిగుతుండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయాడని స్థానికులు చెబుతున్నారు. కాసేపటికి అతడు మృతిచెందాడని వివరించారు. ఈ మేరకు కడియం పోలీస్‌లకు తెలియజేశారు.